
సాక్షి
చిత్తూరు
గురువారం । 7 । డిసెంబర్ । 2023



పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని వికసిత్ భారత్ పరిశీలకులు సచీంద్రనాయక్ తెలిపారు. - 8లో



ముక్కంటి క్షేత్రం.. జనసంద్రం

ఏడు గంగమ్మల జాతర సందర్భంగా బుధవారం ముక్కంటి క్షేత్రమైన శ్రీకాళహస్తి భక్తజనసంద్రంగా మారింది. - 8లో



యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఈవీఎంల వినియోగంపై అవగాహన



ఈవీఎం వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : ఈవీఎంల వినియోగంపై అవగాహన అవసరమని ఆర్డీఓ చిన్నయ్య అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎంల అవగాహన కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యాలయానికి విచ్చేసిన ప్రజలకు ఓటింగ్ వేసే పద్ధతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రామాంజులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

చిత్తూరు రూరల్: రవాణాశాఖలో స్వాధీనం చేసుకున్న 20 వాహనాలకు ఈనెల 12వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వేలం పాటదారులు ఉదయం 10 గంటల్లోపు ముందస్తుగా రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆధార్ చూపించి టోకన్లు పొందాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

భూములు ఇచ్చిన రైతులకు పరిహారం

పూతలపట్టు: భూములు ఇచ్చిన రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పరిహారం తీసుకోవాలని తహసీల్దార్ విజయభాస్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూతలపట్టు మండలం పాలకూరు రెవెన్యూ గ్రామానికి చెందిన 662/2బి, 662/6బి, 662/6బి, 666/2ఏ సర్వే నంబర్లలో గల భూమిని ఎన్‌హెచ్–140 కుక్కలపల్లి వయా మల్లవరం రహదారి నిర్మాణం కోసం సేకరించినట్లు తెలిపారు. అందులో భూములు కోల్పోయి నష్టపోయిన రైతులు తమ వద్ద ఉన్న భూమి పత్రాలతో పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయానికి రావాలన్నారు. పత్రాలను పరిశీలించి నష్టపరిహారాన్ని అందజేస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

9 వరకు ఓటర్ల అభ్యంతరాలు స్వీకరణ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి, అభ్యంతరాలను ఈ నెల 09వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపునకు ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 9వ తేదీ వరకు అందే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పరిశీలించనున్నట్లు తెలిపారు. పరిశీలన చేసిన తర్వాత నిబంధనల ప్రకారం ఖచ్చితంగా ఉండే వాటిని 2024 జనవరి 5న ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాల్లో బీఎల్ఓలు దరఖాస్తులు స్వీకరించారని చెప్పారు. దరఖాస్తుల్లో పూర్తి సమాచారం లేకపోతే విచారణ కష్టతరమవుతుందన్నారు. ఖచ్చితమైన వివరాలు నమోదు చేసేలా ఆయా రాజకీయపార్టీల ప్రతినిధులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో పలు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, అట్లూరి శ్రీనివాసులు, గంగరాజు, పరదేశి, ప్రభుతేజ పాల్గొన్నారు.

వచ్చే ఏడాది ఆర్జిత సెలవులివీ

తిరుపతి రూరల్: కార్మికులకు వేతనంతో కూడిన(ఆర్జిత)సెలవుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆమేరకు కార్మిక శాఖ కర్నూలు జోన్ జాయింట్ కమిషనర్ బాలునాయక్ గురువారం తిరుపతిలో వెల్లడించారు. 2024 లో పండుగలు, సెలవు దినాలకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందన్నారు. జనవరి 16న కనుమ, 26న రిపబ్లిక్ డే, ఏప్రిల్ 11న రంజాన్, మే 1 మే డే, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబర్ 2న గాంధీ జయంతి, 12న విజయదశమి, నవంబర్ 1న రాష్ట్రావతరణ దినోత్సవం, డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా ఆర్జిత సెలవును కార్మికులు హక్కుగా పొందవచ్చన్నారు.

సేవకు సలాం

విపత్తులోనూ.. ఆపన్నహస్తం

వలంటీర్లు విపత్తులోనూ ఆపన్నహస్తం అందిస్తున్నారు. ప్రళయానికి ఎదురొడ్డి బాధితులకు సేవలందిస్తున్నారు. అది కరోనా మహమ్మరి అయినా విరుచుకుపడే తుపాను అయినా సరే ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు అండగా నిలుస్తున్నారు. వరద సమయంలో బాధితులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, పునరావాస కేంద్రాలకు తరలిస్తూ అసలైన సేవకులుగా ప్రశంసలందుకుంటున్నారు. వరదబాధితులకు ఆహారం అందించడంలో, ప్రభుత్వ యంత్రాంగానికి సమాచారం చేరవేయడంలో విశిష్టమైన సేవలందిస్తున్నారు.

- వరద బాధితులకు అండగా వలంటీర్లు
- మేమున్నామంటూ ప్రజలకు భరోసా
- తూర్పు మండలాల్లో విశిష్ట సేవలు

సాక్షి, చిత్తూరు: మిచాంగ్ తుపానుతో చిత్తూరు జిల్లా తూర్పు ప్రాంతంలోని పలు మండలాల్లో అపార నష్టాన్ని మిగిల్చింది. ఇలాంటి విపత్తు సమయంలో మేమున్నామంటూ వలంటీర్లు బాధితులకు అండగా నిలిచారు. ప్రభుత్వం అందించే సాయం వరద బాధితులకు చేరేలా వలంటీర్లు విస్తృత సేవలందించారు. మిచాంగ్ తుపాను ప్రభావం ప్రధానంగా జిల్లాలోని నగరి, నింద్ర, విజయపురం, పుత్తూరు, వడలమాటపేట మండలాల్లో ఎక్కువగా కనిపించింది. ఇక్కడ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా విజయపురం మండలంలో 4 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 70 మంది బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. వరద నష్టం వంటి వివరాలను జిల్లా అధికారులకు అందించారు. జిల్లాలో తూర్పు మండలాలు తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో తుపాను ప్రభావం అంతగా కనిపించలేదు. తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను పునరాస కేంద్రాలకు వెళ్లేలా వలంటీర్లు చర్యలు తీసుకున్నారు. జేసీబీల సాయంతో వరదనీరు లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీనివల్ల ఆస్తినష్టాన్ని నివారించడంలో వలంటీర్లు ముందుచూపుతో వ్యవహరించారని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇక కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా జనం బయటకు రాలేని పరిస్థితుల్లో కొందరు వలంటీర్లు ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందజేసి వారి ఆకలి తీర్చారు. మరికొన్ని ప్రాంతాల్లో వర్షం దాటికి కూలిన ఇళ్లు, వాటి సమగ్ర సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. ఇక ఈ తుపాను ప్రభావం వల్ల సుమారు వెయ్యి ఎకరాల్లో వరి, వేరుశెనగ, కంది పంటతోపాటు ఉద్యానపంటల్లో 45 ఎకరాలు మేర పంట వరద నీటిలో మునిగినట్టుగా ప్రాథమికంగా అంచనా వేశారు. ఆయా ప్రాంతాల్లోని సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేసి రైతులను ఆదుకునేలా వలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.



నగరి: జలమయమైన ప్రాంతంలో బాధితులతో మాట్లాడుతున్న వలంటీర్ జయకుమార్

బాధితులకు అండగా...

నగరి మున్సిపల్ పరిధి కాకవేడు ఏఏడబ్ల్యూ ప్రాంతమంతా జలమయంగా మారింది. రెండు ఇళ్లు కూలిపోయాయి. అక్కడే వలంటీర్‌గా ఉన్న జయకుమార్ బాధితులకు అండగా నిలిచారు. జలమయంగా మారిన ఇళ్లు, కూలిన ఇళ్లకు సంబంధించిన సమాచారాన్ని తహసీల్దార్, వీఆర్వోలకు అందించారు. వారిని సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అధికారులు వారికి నష్ట పరిహారం అందించేందుకు సిద్ధం చేశారు. ఆ నష్టపరిహారం పొందడానికి అవసరమైన ప్రక్రియను స్వయంగా పూర్తి చేశారు. దగ్గరుంచి వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని అందించారు.

తూర్పు మండలాల్లోనే అత్యధిక వర్షపాతం

మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ 31.7 మి.మీ., 4వ తేదీన 22.9 మి.మీ, 5న 31.9 మి.మీ నమోదైంది. ఇందులో నగరి, నింద్ర, కార్వేటి నగరం, రొంపిచెర్ల, పెనుమూరు, పులిచెర్ల, వెదురుకుప్పం ప్రాంతంలో వర్షపాతం అత్యధికంగా నమోదైంది.

ప్రళయంలోనూ బాధితులకు అండగా..



నీటిని దారి మళ్లిస్తున్న జేసీబీ సిబ్బందితో వలంటీర్

నగరి మండలంలోని టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ నివాసాలకు చెందిన వలంటీర్లు తిరుపాళ్, నిరుపమ. వీరు తుపాను నేపథ్యంలో ముందస్తు సమాచారం అందించి స్థానికులను అప్రమత్తం చేశారు. నివాసాల మధ్యలోకి వచ్చిన వర్షపు నీటిని త్వరగా మళ్లించడానికి సహకారం అందించారు. ప్రతి సారీ జలమయంగా మారే ఇందిరమ్మ నివాసాలు, వీధులకు సంబంధించి అధికారులకు సమాచారమందించి, కాలువ కట్టను పటిష్టం చేసి ఎత్తుపెంచేలా చేశారు. వర్షాన్ని సైతం లెక్కచేయక జేసీబీ సిబ్బందితో కలిసి పనిచేశారు. రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా చూశారు. స్థానికులందరూ వలంటీర్ల శ్రమను గుర్తించి ప్రశంసలందించారు.

ప్రమాదం నుంచి తప్పించి



కూలిపోయిన ఇంటి ముందు లత

నా పేరు లత, మాది నగరి మండలం సమీపంలోని అడవి కండ్రిగ, నా భర్త ఎర్రబ్బతో కలిసి వచ్చి కార్వేటినగరం పద్మసరస్సు సమీపంలోని గొల్లఇండ్లులో ఉంటున్నాం. ఈ తుపాను నేపథ్యంలో వలంటీర్ రూప ముందుగానే మా ఇంటికి వచ్చి పరిశీలించింది. భారీ వర్షాలు కురిస్తే, ఇల్లు కూలిపోయే పరిస్థితి ఉందని చెప్పి వేరే ఇంటికి మారాలని చెప్పింది. వెంటనే వేరే ఇల్లు మాట్లాడి మమ్మల్ని అక్కడికి తరలించింది. మేము ఇల్లు మారిన మరుసటి రోజే పూరిల్లు కుప్ప కూలిపోయింది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం ఇప్పించేందుకు రూప ప్రయత్నం చేస్తోంది. మా లాంటివారికి వలంటీర్లు అండగా నిలుస్తున్నారు.

జలదిగ్బంధంలోనూ..



మంత్రి పంపిన నిత్యావసర సరుకులు అందిస్తున్న వలంటీర్ భూపతి

నగరి మండలం వేలావడి ఎస్టీకాలనీకూడా తుపాను ప్రభావానికి నీటమునిగింది. అక్కడి వలంటీర్ భూపతి, జలమయంగా మారిన ఇళ్ల వివరాలను అధికారులకు, ప్రజాప్రతినిధులకు అందించారు. స్థానిక సర్పంచ్ చంద్రకళ ద్వారా మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టుద్వారా నివాసితులకు నిత్యావసర సరుకులు అందించగా వాటిని బాధితులందరికీ ప్రతి ఇంటికీ తీసుకెళ్లి అందజేశాడు. కాలనీ జలదిగ్బంధంలో ఉన్నా వలంటీర్ నీళ్లలోనే వెళ్లి ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు చేరవేస్తూ బాధితులకు అండగా నిలబడ్డాడు.

సోలార్ పుంగనూర్

- రూ.6 కోట్లతో సోలార్ ప్లాంటు ఏర్పాటు
- ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి
- మున్సిపాలిటీకి నెలకు రూ.35 లక్షల ఆదా



పుంగనూరులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా (ఫైల్)

పుంగనూరు: సౌర విద్యుత్‌తో పుంగనూరు మున్సిపాలిటీలో వెలుగులు విరజిమ్మనున్నాయి. పుంగనూరు మున్సిపాలిటీకి పెనుభారంగా మారిన విద్యుత్ బిల్లుల నుంచి ఉపశమనం కలిగేలా సొంతంగా సౌర విద్యుత్ ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తోంది. ఈ పనులకు సంబంధించి మంగళవారం నిరాడంబరంగా అధికారులు భూమి పూజ చేశారు. ఈ ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సాధ్యమైనంత వరకు ఈ సోలార్ ప్రాజెక్టు ద్వారా అవసరాలకు పోగా, మిగులు విద్యుత్ విక్రయించుకునే విధంగా ఆలోచిస్తున్నారు.

రూ.6 కోట్ల సీఎస్ఆర్ నిధులు

పుంగనూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. సంబంధించిన నిధులు మున్సిపాలిటీ భరించేందుకు ఇబ్బందులు ఎదురుకావడంతో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి దీనిపై కసరత్తు చేశారు. చివరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో ప్లాంటు ఏర్పాటుకు ప్రయత్నించి సఫలీకృతులయ్యారు. ఈ నిధులతో ఈ నెలలోనే పనులు ప్రారంభించి, జనవరి మొదటి వారానికి అంతా పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ప్లాంటు ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి, పుంగనూరు మున్సిపాలిటీకి వినియోగించుకోనున్నారు.

ఒక మెగావాట్ ఉత్పత్తి

పుంగనూరు సోలార్ ప్లాంట్ ద్వారా ఒక మెగా వాట్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. దీనికి అనుగుణంగానే సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం పుంగనూరు మున్సిపాలిటీకి సంబంధించిన వీధి దీపాలు మున్సిపల్ కార్యాలయం, తాగునీటి పథకాలు, తదితర వాటికి రోజుకు 4వేల యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంది. ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ మున్సిపాలిటీ అవసరాలకు పోను ఇంకా మిగులుతుంది.

డిస్కం ద్వారా సరఫరా

సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ నేరుగా డిస్కం సబ్ స్టేషన్‌కు చేరుతుంది. అక్కడి నుంచి మున్సిపాలిటీ అవసరాలకు విద్యుత్ వినియోగిస్తారు. ప్లాంట్ నుంచి ఎంత విద్యుత్ డిస్కంకు సరఫరా అవుతుంది. ఎంత విద్యుత్ మున్సిపాలిటీ వినియోగిస్తోందో గణిస్తారు. ఆ గణాంకాలను బట్టి మిగులు విద్యుత్‌ను విక్రయించుకుంటారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో మున్సిపాలిటీకి అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరనుంది.

రూ.5.25 కోట్ల ఆదా

ఈ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం ద్వారా పుంగనూరు మున్సిపాలిటీకి ఏడాదికి రూ.5.25 కోట్లు ఆదా అవుతుందని అంచనా. ప్రస్తుతం నెలకు రూ.35 లక్షల విద్యుత్ వినియోగం అవుతోంది. సోలార్ విద్యుత్ వినియోగంతో ఖర్చు తగ్గుతుంది. దీని ద్వారా మున్సిపాలిటీలో అదనంగా ప్రజలకు అవసరమైన వసతులు, అభివృద్ధి పనులు చేపట్టవచ్చు.

విద్యుత్ ఆదా చేసేందుకే..



మున్సిపాలిటిలో ప్రతి యేటా సుమారు రూ.4 కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. దీని ద్వారా మున్సిపాలిటీకి ఆర్థికభారం పెరిగి అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రణాళికలు ఏర్పాటు చేశాం. పట్టణంలోని మోటార్లు, వీధి దీపాల వినియోగానికి ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్‌ను రూ.6 కోట్లతో నిర్మిస్తున్నాం. రెండేళ్లలో ప్లాంటు నిర్మాణ ఖర్చు రాబట్టుగలుగుతాం. పూర్తి స్థాయిలో సోలార్‌ను అమల్లోకి తీసుకొచ్చి విద్యుత్ ఆదాచేస్తాం.

- డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి

అన్ని రంగాల్లో అభివృద్ధి



పుంగనూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం. రూ.6 కోట్లతో సోలార్ ప్లాంటు పనులు ఇటీవలే ప్రారంభించాం. త్వరలోనే పూర్తి చేయిస్తాం. విద్యుత్ బిల్లులకయ్యే మున్సిపల్ నిధులను మౌలిక వసతుల ఏర్పాటుకు ఖర్చు చేస్తాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పుంగనూరును అన్ని విధాలా అభివృద్ధి చేసి, ఆదర్శంగా నిలుపుతాం.

- పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

సహకారానికి జగనన్న చేయూత



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: రాష్ట్రంలో కునారిల్లుతున్న సహకార రంగానికి చేయూత అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో డీసీసీబీ నిధులు రూ.18.80 లక్షలతో పలమనేరు పీఏసీఎస్ కార్యాలయం వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడతో కలసి వారు బుధవారం ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సహకార బ్యాంకులో రుణాలు పొంది చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న రైతులకు నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అండగా నిలిచి, రూ.900 కోట్లను మాఫీ చేశారని గుర్తుచేశారు. ఆ తరువాత సహకార రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు పాలకు ప్రోత్సాహం కల్పించారని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ మొగసాల రెడ్డెమ్మ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతం కోసం పెట్రోల్ బంకులను సైతం నడుపుతున్నామన్నారు. ఇదే మండలంలోని బయ్యప్పగారిపల్లి సింగిల్‌విండోలోనూ ఈ సేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. పలమనేరు పీఏసీఎస్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడం ద్వారా కొందరికి ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లా సెంట్రల్ బ్యాంకు ద్వారా రూ.2,600 కోట్ల లావాదేవీలు సాగుతున్నాయని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ మాట్లాడుతూ ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఇప్పటికే నిరూపించామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో మనోహర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, స్థానిక సింగిల్‌విండో చైర్మన్ రఘునాథ్, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి, రాజంపేట పరిశీలకులు బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, వైస్ చైర్మన్ రవి, మండల కన్వీనర్ బాలాజీనాయుడు, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ బాటలో పయనిద్దాం

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ బాటలో పయనిద్దామని స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని వీరు బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన అంబేడ్కర్ ప్రతి ఒక్కరికీ ఆదర్శమేనన్నారు. అనంతరం పట్టణానికి చెందిన ఎస్సీ ఉద్యోగ సంఘం నాయకులు పుష్పరాజ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.45 కోట్లు



హుండీ కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ కానుకల ద్వారా రూ.1.45 కోట్లు ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. స్వామివారి ఆలయంలో గత 22 రోజుల హుండీ కానుకలను బుధవారం స్వామివారి ఆస్థాన మండపంలో లెక్కించారు. బంగారం 30 గ్రాములు, వెండి 4.41 కిలోలు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.8వేలు, విదేశీ కరెన్సీ 1,990 డాలర్లు, ఆస్ట్రేలియా 10 డాలర్లు, ఇంగ్లాండ్ 25 పౌండ్స్, యూఏఈ 30 దీరమ్స్, సింగపూర్ 2 డాలర్లుతో కలిపి రూ.1.45 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్ బాబు, దేవస్థాన సిబ్బంది, కాణిపాక యూనియన్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డ ఆచూకీ తెలపండి



సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు

చిత్తూరు రూరల్: తమ బిడ్డ అదృశ్యమై నెలలు గడుస్తున్నా ఆచూకీ లేదని బంగారుపాళెం మండలం పులిమడుగు గ్రామానికి చెందిన ఏలుమలై ఆవేదన వ్యక్తం చేశాడు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన 16 ఏళ్ల కుమార్తె అక్టోబర్ 10న అదృశ్యమైందన్నారు. దీనిపై బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పార్థిబన్ అనే వ్యక్తితో వెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించామన్నారు. పోలీసులు స్పందించి తన బిడ్డకు అప్పగించాలని వేడుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

పెనుమూరు(కార్వేటినగరం): ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెనుమూరు మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, సోమల మండల కేంద్రానికి చెందిన లక్ష్మయ్య కుమారుడు బి.మనోహర్(47) తానా వేణుగోపాలపురంలోని తన అన్న సుధాకర్ ఇంటికి వచ్చి, పెనుమూరు మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. పెనుమూరు బీసీ కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా పెనుమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే తిరుపతికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించినట్లు తెలిపారు. ఈ విషయమై పెనుమూరు ఏఎస్‌ఐని వివరణ కోరగా రోడ్డు ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ పథకాలు అందాలి
- గ్రామీణులకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి
- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పరిశీలకులు సచీంద్రనాయక్


సమీక్షలో మాట్లాడుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పరిశీలకులు సచింద్రనాయక్ పట్నాయక్

చిత్తూరు కలెక్టరేట్ : పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పరిశీలకులు సచింద్రనాయక్ పట్నాయక్ అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం పక్కాగా నిర్వహించాలని తెలిపారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వాల లక్ష్యమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో 697 పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం నవంబర్ 27 నుంచి కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా జెడ్పీ సీఈఓ వ్యవహరిస్తున్నారని వివరించారు. జిల్లాకు 6 ప్రచార యాత్ర వాహనాలను కేటాయించారని పేర్కొన్నారు. ఒక్కో వాహనం ప్రతి రోజు రెండు పంచాయతీల్లో డిజిటల్ స్క్రీన్‌లో వీడియోల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం ఎంపీడీవోలు మండలాల్లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పథకాల ద్వారా ఇంకనూ లబ్ధి పొందేందుకు అర్హులు ఉన్నట్లెతై వారిని గుర్తించి నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జల్ జీవన్ మిషన్ కింద జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని 2024 జనవరి 25వ తేదీ లోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పద్మనాభం, తులసి, రాధమ్మ, రాజ్యలక్ష్మి, చంద్రశేఖర్, శంకరన్, హరీష్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కేంద్ర పథకాలు ఇలా

పీఎంజేఏవై లబ్ధిదారులు	-	25,592
బీపీఎల్ కార్డుదారులు	-	4,99,288
దీనదయాళ్ అంత్యోదయ యోజన	-	878
పీఎం అవాస్ యోజన గృహాలు	-	73,584
పీఎం ఉజ్వల్ యోజన గ్యాస్ కనెక్షన్లు	-	5,934
పీఎం కిసాన్ లబ్ధిదారులు	-	2,32,693
పీఎం కిసాన్ క్రెడిట్ కార్డులు	-	833
పీఎం పోషణ అభియాన్	-	22,303
స్వామిత్వ సర్వే గ్రామాలు	-	42
జన్‌ధన్ యోజన ఖాతాలు	-	5,26,778
జీవన్‌జ్యోతి బీమా యోజన ఖాతాలు	-	3,59,606
సురక్ష బీమా యోజన ఖాతాలు	-	9,57,658,
అటల్ పెన్షన్ యోజన ఖాతాలు	-	1,05,808

హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి


హోంగార్డులతో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని పోలీసు శిక్షణా కేంద్రంలో బుధవారం 61వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవ కోసం 1946 లోనే పురుడుపోసుకున్న హోంగార్డు వ్యవస్థ ప్రజలకు, పోలీసులకు నిరంతరం సేవలందిస్తోందన్నారు. పోలీసు శాఖ ప్రతిష్టను కాపాడేలా హోంగార్డులు పనిచేయాలని పిలుపునిచ్చారు. వీఐపీల భద్రత నుంచి శాంతిభద్రతల పరిరక్షణ వరకు జిల్లాలో 576 మంది పనిచేస్తున్నారని చెప్పారు. ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికల విధులకు సైతం జిల్లా నుంచి హోంగార్డులు హాజరై బాధ్యతగా వ్యవహరించినట్లు గుర్తుచేశారు. విధి నిర్వహణలో గాయపడిన వారికి రూ.30 వేలు, మృతి చెందిన కుటుంబాలకు రూ. 4 లక్షలు, పదవీ విరమణ పొందిన వరాఇకి రూ.4 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివిరంచారు. ఇటీవల మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, డీఎస్పీలు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, విష్ణురఘువీర్, బాబు ప్రసాద్, శ్రావణ్‌కుమార్, మురళీధర్ పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు


బంగారుపాళెం: సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు


ఐరాల: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుజాత తెలిపారు. గుంటూరు జిల్లా వెనిగండ్ల పాఠశాల క్రీడా మైదానంలో గత నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో 8వ తరగతి చదువుతున్న సోనియా సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. 2024 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొననున్న సోనియాను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..

ఐరాల/పూతలపట్టు: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు బుధవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు మెసానికల్ క్రీడామైదానంలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నంద్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న జీవన్ సాయి, రోహిత్, మువశ్రీ, భవితను పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు అభినందించారు. ఇదే జట్టులో పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7 వ తరగతి చదుతువుతున్న కె.గోవర్ధన్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.


గోవర్ధన్

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ

తిరుపతి రూరల్: యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేస్తున్నామని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు పేర్కొన్నారు. ఆయన రెండు రోజులుగా ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులు, సిబ్బంది నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వరదలు కొనసాగుతున్న ప్రాంతాల్లో కూడా స్థానిక అధికారులు, సిబ్బందితోపాటు కర్నూలు, అనంతపురం, కడప సర్కిళ్ల నుంచి విచ్చేసిన అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు పని చేస్తున్నారని తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా వున్న ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులకు ఆటంకం ఏర్పడుతోందన్నారు.

గృహ, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత


పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గృహ, తాగునీటి సరఫరా కోసం అవసరమైన విద్యుత్ సర్వీసులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని సీఎండీ సంతోషరావు తెలిపారు. శాశ్వత ప్రాతిపాదికన విద్యుత్ లైన్ల మరమ్మతు పనులను చేపట్టేందుకు అవకాశం లేని ప్రాంతాల్లో కేబుళ్లను ఏర్పాటు చేసి, తాత్కాలికంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంస్థ పరిధిలో తుపాన్ కారణంగా ఆది, సోమవారాల్లో 11.53 లక్షల విద్యుత్ సర్వీసులు, 1.65 లక్షల వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. బుధవారం సాయంత్రానికి 11.27 లక్షల విద్యుత్ సర్వీసులు, 42 వేల వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించామన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని 7 పట్టణాలు, 1132 గ్రామాలకు బుధవారం సాయంత్రానికి సరఫరాను పునరుద్ధరించామని తెలిపారు. మిగిలిన సర్వీసులకు కూడా గురువారం ఉదయానికల్లా సరఫరా పునరుద్ధరణ పనులను పూర్తి చేస్తామన్నారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 425 155333 కాల్ చేయవచ్చని, అదేవిధంగా సంస్థ వాట్సాప్ నంబర్ 91333 31912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

విద్యుదాఘాతానికి రెండు ఆవులు మృతి


మృతి చెందిన ఆవులను పరిశీలిస్తున్న ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి

రొంపిచెర్ల: విద్యుదాఘాతానికి రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, పాతకురవపల్లెకు చెందిన లోకనాథం మూడు పాడి ఆవులను దండపాణి మామిడి తోట ఎదురుగా ఉన్న పొలాల్లో మేతకు వదిలారు. అవి మేసుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర తెగిపడిన విద్యుత్ తీగను తొక్కేశాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురై రెండు ఆవులు విలవిల్లాడుతూ మృత్యువాతపడ్డాయి. దీంతో రైతు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు. వాటి విలువ సుమారు రూ. 2లక్షలు ఉంటుందని రైతు చెప్పరు. సమాచారం అందుకున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, బాధిత రైతు లోకనాథను పరామర్శించి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

ముక్కంటి క్షేత్రం.. భక్తజనసంద్రం



కొత్తపేటలో కొలువుతీరిన భువనేశ్వరి, గాంధీవీధిలోని అంకమ్మ

శ్రీకాళహస్తి: ఏడుగంగల జాతరతో జంగమయ్య క్షేత్రం పులకించిపోయింది. సప్తగంగల వైభవాన్ని చాటుతూ జరిగిన ఏడుగంగల జాతర ప్రాభవాన్ని చూసి తరించేందుకు అశేష జనవాహినితో భక్తజనసంద్రమైంది. శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల జాతర వైభవంగా జరిగింది. ఏడుగంగమ్మల గుడి వద్ద నుంచి ఏడుగురు గంగమ్మలను ఆయా జాతర కమిటీలు మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పురవీధుల్లో ఊరేగించారు. ఏడుగంగమ్మల ఊరేగింపు వైభవాన్ని చూసేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. భక్తులు గంగమ్మలను దర్శించుకుని, హారతులిచ్చారు. పిండిదీపాలు, కొబ్బరికాయలతో నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో దేవతా కళారూపాలు ఆకట్టుకున్నాయి. ముత్తాలమ్మగుడి వద్ద ప్రత్యేక హారతులు సమర్పించిన తరువాత పెండ్లిమండపం వరకు చేరుకుని మొదటి గంగమ్మను స్థాపించారు. సప్త గుర్రాలు కలిగిన సూర్యప్రభ వాహనంపై అష్ట భుజాలతో ఆయుధాలు ధరించి బంగారు రంగు వస్త్రాలతో భక్తులకు మొదటి గంగమ్మ పొన్నాలమ్మ రూపంలో నిలువెత్తు రూపంతో కనువిందు చేసింది. అనంతరం గాంధీవీధి గంగమ్మ కోనేరు పక్కన కుమారస్వామి ఆలయ సమీపంలో కొలువుదీరింది. ఈమె అంకమ్మ విశ్వరూప ప్రశాంతమై రథంపై 8 చేతుల్లో ఆయుధాలతో బంగారుచీర ధరించి తలపై కొప్పుతో భక్తులకు దర్శనమిచ్చింది. భేరివారి మండపం వద్ద పూల హంస పడవ గోపురం ఆకృతిలో నిర్మించిన రథం అందరిని ఆకట్టుకుంది. దీనిపై ముత్యాలమ్మ అమ్మవారు శూలం ధరించి పసుపు వర్ణంతో ఎర్రని చీర ధరించి ఆకట్టుకునేలా ఏర్పాటు చేశారు. ఉత్తరాజి శరవణ బృందం ఏర్పాట్లను చేశారు. జయరామరావువీధిలో కావమ్మ పూలచంద్ర ఆకృతి రథంపై ఐదు తలల శేషుడి నీడలో వాసుకిపై నాట్యం చేస్తున్నట్లుగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సన్నిధివీధిలో వెండి కవచాలతో, వెండి సింహవాహనంపై వెండి ఛత్రం కింద ఐదు తలల శేషుడిని కిరీటంగా ధరించి అద్భుతమైన పూలకిరీటంతో నాలుగు భుజాలతో అంకాలమ్మ ఆశీనురాలై భక్తులకు దర్శనమిచ్చింది. బ్రాహ్మణవీధిలో నల్లగంగమ్మ కలశం, కమలం, చంద్రుడు కిరీటంలాగా ఉన్న ఐదు గుర్రాలు కలిగిన రథంపై 46 చేతులతో నల్లగంగమ్మ భక్తులకు కనువిందు చేసింది. కొత్తపేట భువనేశ్వరి అమ్మవారు ఎనిమిది చేతులలో ఆయుధాలు ధరించి, రెండు అశ్వాల రథంపై నిలబడి భక్తులకు దర్శనమిచ్చింది అనంతరం రాత్రి 7 గంటలకు అమ్మవార్లకు ఏడుగంగమ్మల ఆలయం వద్ద నిమజ్జనం చేశారు.

సచివాలయాల్లో స్వైపింగ్

- ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు
- నగదు రహిత చెల్లింపులకు చర్యలు
- 145 పంచాయతీలకు ఈ-పోస్ యంత్రాల పంపిణీ


గుడిపాల మండలం వసంతాపురం పంచాయతీలో డిజిటల్ చెల్లింపులు

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయాల్లో స్వైపింగ్ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీలో పన్నులు, వివిధ సేవల రుసుముల చెల్లింపులకు నగదు రహిత లావాదేవీలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ-పోస్ (స్వైపింగ్) యంత్రాలు, క్యూర్ కోడ్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది. జిల్లాలో 697 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో 584 పంచాయతీలకు క్యూఆర్ కోడ్, మూడువేల జనాభా ఉన్నా 113 మేజర్ పంచాయతీలకు 145 ఈ-పోస్ యంత్రాలు అందించింది. మొత్తం 697 పంచాయతీల్లో ఆన్‌లైన్ చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి నగదు రహిత విధానం ప్రారంభమైనా పూర్తి స్థాయిలో జరగడం లేదు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఈ-పోస్ యంత్రాల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలన్నీ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామ పంచాయతీలు బ్యాంకు ఖాతాలను తెరిచారు. గ్రామ పంచాయతీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత రుసుంతోపాటు ఇంటి యజమానులు ఏటా చెల్లించే ఇంటి పన్ను కూడా డిజిటల్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ఈ-పోస్ యంత్రాలు ఇచ్చారు. పన్నులకు సంబంధించి ప్రతీది లెక్క పక్కాగా నమోదు చేస్తున్నారు. ఏ పంచాయతీ పరంగా ఎంత మొత్తం పన్నులు వసూలయ్యాయి. ఎంత కావాలనే విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కార్యదర్శుల పనితీరు ఉన్నతాధికారులు తెలుసుకుని పర్యవేక్షించే సౌలభ్యం ఉంటుంది.

ప్రయోజనాలు

- ఈ-పోస్ యంత్రాల ద్వారా చెల్లించిన వెంటనే రశీదు పొందవచ్చు
- చెల్లింపు పూర్తయిన వెంటనే ఆన్‌లైన్‌లో వివరాలు నమోదవుతాయి
- అన్ని బ్యాంకుల ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డుల ద్వారా ఈ-పోస్ యంత్రంలో స్వైపింగ్ చేయవచ్చు
- ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను వినియోగించవచ్చు
- అవినీతికి అవకాశం లేకుండా పన్నుల ఆదాయం పంచాయతీ ఖాతాకు జమవుతుంది
- చెల్లింపులు సులభంగా వేగంగా పూర్తవుతాయి

జిల్లా సమాచారం

జిల్లాలోని మొత్తం పంచాయతీలు	-	697
అందులో మేజర్ పంచాయతీలు	-	113
మైనర్ పంచాయతీలు	-	584
వాటికి వచ్చిన ఈ-పోస్ యంత్రాలు	-	145
వీటి ద్వారా వసూలైన పన్నులు	-	రూ.90 లక్షలు

వీటిలో అధికం

పంచాయతీలో ఆన్‌లైన్ ద్వారా పన్నుల వసూళ్లకు ఈ-పోస్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గత నెల రోజులుగా జిల్లాలో మొత్తం రూ.90 లక్షల వరకు ఆన్‌లైన్ ద్వారా పన్నుల చెల్లింపులు అయ్యాయి. ఇందులో మోర్ధాన్‌పల్లె రూ.10.74 లక్షలు, వి.కోటలో రూ.23.23 లక్షలు, బంగారుపాళ్యం రూ.4.79 లక్షలు, సదుం రూ.5 లక్షలు, లద్దిగం రూ.3.59 లక్షలు, గంగవరం రూ.3.36 లక్షలు, కల్లూరు రూ.3.15 లక్షలు, రొంపిచెర్ల రూ.2.16 లక్షలు, పాపిరెడ్డిగారిపల్లె రూ.1.99 లక్షలు, కార్వేటినగరం రూ.1.78 లక్షలు, అరగొండ రూ.1.52 లక్షలు, మట్టం రూ.86వేలు కాణిపాకం రూ.80 వేలు చొప్పున మొత్తం ఈ 13 పంచాయతీల్లో దాదాపు రూ.62.96 లక్షల పన్నులు వసూలయ్యాయి.

అవగాహన కల్పిస్తున్నాం



పంచాయతీలకు ఈ-పోస్ పరికరాలను అందజేశాం. సంబంధిత పంచాయతీలకు సంబంధించి బ్యాంకు ఖాతాలు తెరిచాం. డిజిటల్ చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. చెల్లింపులు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రజలందరూ సహకరించి ఆన్‌లైన్ చెల్లింపులను అలవాటు చేసుకోవాలి. దీనిపై ఇదివరకే పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చాం.

- లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి, చిత్తూరు